# బూచి

నిరాఘాటంగా ప్రజాస్వామ్యం ప్రజ్వరిల్లిన దరిమిలా, వెలుగు పూలతో వికసించిందని అనుకోబడుతున్న బీద ఓటరు ప్రజానీకం తెలివిలా భగ్గున మండుతూ, నడినెత్తిన వెల్లివిరిసిన భారతమాత కిరీటంలా, రెపరెపలాడే బావుటాలా, దగధగా మెరుస్తున్నాడు సూర్యుడు.

ముఖలింగానికి ఒకరి ఊసూ, జోలీ అక్కరలేదు. తన దోవన తాను పోతాడు. గొడవలంటే అతనికి భయం.

అసలు ఆ కుటుంబమే అంత. మతసామరస్యం తమ నమ్మిక అని సర్వత్రా చెప్పడానికేమో మొదటి బిడ్డకి ముఖలింగాచారి అని నామకరణం చేశారు. శైవ వైష్ణవ భేదాలు మనం కల్పించుకున్నవే అని అందరూ అనుకోవాలనే విశాల హృదయం వాళ్లది.

అగ్రహారం గృహస్థులంతా పాడి మెతుకులు తిని కాస్తంత ఎండ తీవ్రత మరిచిపోడానికి కూటి కునుకు తీస్తున్నారు.

నల్లటిరోడ్డు నదిలా మిలమిలా మెరుస్తోంది.

కావిట్లో తాటికాయలువేసుకుని కత్తి జిగ్గుమని మెరుస్తుండగా చెమటతో తడిసిన నల్లటిశరీరం జిగి కత్తి జిగితో పోటీపడుతుండగా గోచిపాత కట్టుకున్న యాతమనిషి ముంజులూ, ముంజులూ అంటూ పరుగులాంటి నడక సాగిస్తున్నాడు. లయబద్ధంగా కావిడి కుయ్ కుయ్ మంటోంది.

తెల్లటి మాసిక వేసిన గొడుగుతో యాయవారం బ్రాహ్మణుడు తెరిచిన తలుపులుకోసం చూడకుండా వాడిక ఇళ్లు పూర్తి చేయడానికి తలుపుకొట్టి లోపలకెళ్లి పలికించుకుంటున్నాడు.

ముఖం ఎర్రగా జేవురించిన ముఖలింగాచారి అరుగెక్కి తలుపు గడియ టకటకా కొట్టాడు.

"తలుపు తియ్యండ్రా! చిన్నబట్టతో ఉన్నాను."

కోమలవల్లి వంటింట్లోంచి ముందుగదిలోకి కేకేసింది.

"వస్తున్నా!" పరుగున వెళ్లి తలుపు తీశాడు చిరంజీవి శఠగోపాచార్యులు.

"వెధవల్లారా! ఎండబడివస్తే వెంటనే తలుపు తీయాలన్న జ్ఞానంలేదూ? కాళ్లు మాడిపోయాయ్"

పాపం ముఖలింగాచారికి జోళ్లు తొడుక్కునే అదృష్టంలాంటి సుఖంలేదు. పావుకోళ్లు వేసుకుంటే వింతగా చూస్తారు ప్రజ. తోలు జోళ్లైతే కాళ్లు దురదపుట్టడం, వాచిపోవడం, డాక్టర్లు, ఎలర్జీ అనడం ఇత్యాది బాధలతో పాటు పదీ పాతికా మందులకీ ఖర్చు.

గబగబా మరోసారి చెంబుడు నీళ్లతో ముఖమూ కాళ్లూ కడుక్కుని మడిపంచ కట్టుకుని పీటవాల్చుకు కూర్చున్నాడు ముఖలింగం.

దహో త్రులిద్దరూ వీధిసావిట్లో కిటికీలో కూచుని రెయిలు ఆట ఆడుకుంటున్నారు.

"అమ్మా బిచ్చం వెయ్యడమ్మా!"

కిటికీలోంచి చూశాడు చిరంజీవి.

"అమ్మో! బూచి"

తక్కున తలుపు జేరవేసేశాడు.

"నేనూ చూస్తాన్రా బూచిని..."

అలివేల్ మంగతాయారు అడిగింది అనునయంగా.

"అమ్మో! సంచిలో పడేసి పట్టుకుపోడూ!"

"రోగిష్టిదాన్ని బాఁవు! పిడికిడు గింజ లొడెయ్యండి, గంజికాసుకుంటా!"

"వెళ్లెళ్లు, పనిలేకపోతేసరి" ఒక ఇల్లాలు కసిరి కొట్టింది.

బిచ్చగత్తెకి నాలిక పిడచకట్టుకుపోతోంది.

దాహం! దాహం!

కాసిని నీళ్లవరైనా పోస్తే బాగుణ్ణు.

మ్యునిసిపాలిటీ కుళాయివేపు జాలిగా చూసింది. మొండిచెయ్యిలా బుర్రలేని గొట్టం.

సాయంకాలం గంటతప్ప మరి పడదు. మళ్లీ సాయంకాలం వరకూ అంతే. ఎక్కడా నీటి తడైనాలేదు.

సిమెంటు దిమ్మా, చప్టామాత్రం నున్నగా ఉన్నాయి. దిమ్మ వెనకాల ఎత్తైన గోడమధ్య నున్నగా పాలరాయిమీద కొట్టవచ్చినట్టు కనపడుతున్నాయి అక్షరాలు.

బిచ్చగత్తె తెరిచిన వాకిళ్లకోసం చూస్తోంది.

తలుపులు అన్నీ వేసే ఉన్నయ్.

కిటికీలోంచి పిల్లలు కనిపించారు.

"పాపా! కాసిని నీళ్లు పొయ్యవూ! బాబూ, పేనం కడంటి పోతుంది. బుక్కడు నీళ్ళియ్యవా! మాతల్లే, మాతండే!"

బూచి మెడలో ఇత్తడి బిళ్లవంకే చూస్తున్నాడు తలుపు సందులోంచి బాబు.

కిటికీదగ్గరగా వచ్చి మళ్లీ అడిగింది బిచ్చగత్తె.

లోపల భోజనానికి కూచున్న ముఖలింగానికి కోపం వచ్చింది.

"వెధవపోరు! వెధవపోరా అని. పిల్లల్నిటు పిలువ్. తలుపు తీసిఉంటే ఇదేగొడవ".

"ఒరేయ్, తాతగారు దెబ్బలాడుతున్నారు. తలుపులువేసి లోపలకు రండి."

కోమలవల్లి వెంటనే భర్త తాఖీదుని దహోత్రుల కందజేసింది.

"బాబూ, బుక్కడు నీళ్లు...కళ్లు పేలిపోతున్నాయి."

నడుం కిందనుంచీ పిక్కలమీది వరకూ వింతైనా గుండారు. మీదనొక జాకెట్టులాంటి చాలీ చాలని రవిక.

క్లాస్ ఎగొట్టి ఎండవేళ నిద్రపోడానికి ఇంటికివస్తున్న కాలేజీ కుర్రాడు బిచ్చగత్తెవైపు చూశాడు. హిందీసినిమాలో క్లబ్‌డాన్సర్ కాస్ట్యూమ్స్, టూపీస్‌డ్రెస్ ఇది చూసే డిజైన్ చేయబడిందేమో ననుకున్నాడు. డిజైనర్ నిజజీవితంలో ఏదీ చూడకుండా, ఏ నమూనా లేకుండా ఎలా డిజైన్ చెయ్యగలడు మరి!

విమెన్స్‌కాలేజీ అమ్మాయి అటే వస్తోంది.

వింతైన మృగారావంచేసి బిచ్చగత్తి కింద పడిపోయింది.

"అమ్మమ్మ. బూచి కిందపడిపోయింది."

పాప లోపలికి దౌడుతీసింది.

కాలేజీ విద్యార్థిని అలా నుంచుండిపోయింది.

మూడు గజాలదూరంలో కిందపడి వింతగా అరుస్తోంది బిచ్చగత్తి -

ఆమె బిగువునే చూస్తోంది విద్యార్థిని.

వీళ్లేం తింటారనీ, ఇంత బిగువుగా ఉంటారు? మూడేళ్లై ప్రయత్నం చేస్తోంది, ఎవరేం చెబితే ఆ చిట్కా. ఏం ప్రయోజనం? కిందకు చూసుకుంది అందుకే తన వంక ఎవరూ చూడరు. పక్కవాళ్ల మేనల్లుడు, అదే అటుపోర్షన్లో...ఒక్కడే ఉన్నాడు ఇంట్లో. తన ఇంట్లోనివాళ్ళూ ఎక్కడికో వెళ్లారు. రాత్రివేళ పిండారబోసినట్టు వెన్నెల. పట్టిమంచంమీద తెల్లటి తలగడమీద తలపెట్టుకుని పడుకుంది. అసలు తనవంకైనా చూడకుండా అటువైపు మరో మంచం వేసుకుని పక్కన బెడ్‌ల్యాంప్ పెట్టుకుని పుస్తకంలో మునిగిపోయాడు.

ఛీ! తన బ్రతుకు వ్యర్థం.

అటుపక్కనుంచి డాక్టరుగారి దగ్గర ప్రత్యేక సలహాకోసం రిక్షాలో వస్తున్న నగల వ్యాపారి ఎబోతున్న రిక్షావాడిని ఆపేశాడు. "డాక్టరుగారు మళ్లీ ఇంటికి వచ్చేస్తారు. తొందరగాపద."

రిక్షావాడు రిక్షాదిగి పక్కనుండి బండి లాగుకుపోయాడు. బిచ్చగత్తె వింతకేకలు గుండెల్లో వడపుట్టిస్తున్నాయ్.

చుట్టూ ఒక గుంపు చేరింది.

"నీళ్లు! నీళ్లు!"

అదరా బాదరా అటువచ్చిన ఒక యువకుడు.

"నీళ్లు!" ఎన్నో గొంతులు.

ముఖలింగంగారు తలుపు తెరిచారు.

"నీళ్లు కావాలి మాష్టారూ!"

"నీళ్లెక్కడివీ! సాయంకాలంవరకూ పంపురాదు. నూతిలో నీళ్లు అమ్మాయి బట్టలు ఉతకడానికి తోడేసింది!"

"పోసీ తోడుకోమందురూ!" కోమలవల్లి మెత్తబడింది.

"ఎవరు తోడుతారు?"

"నేవెళ్లి తోడుకువస్తా" లోపలకెళ్లి బాల్చీనిండా నీళ్లుతోడుకువచ్చి బిచ్చగత్తెమీద దిమ్మరించాడు.

బిచ్చగత్తె మెల్లగా కదిలింది.

"ఇంకొక్క బకెట్టు!" గుంపులోంచి ఉచిత సలహా.

సిల్కుచొక్కా ఆసామీ గుడ్లప్పగించి చూస్తున్నాడు.

తను బొంబాయినించి తెప్పించుకున్న పుస్తకం కళ్లముందు మెదిలింది.

అబ్బ! ఎంతపొంకం! తన పుస్తకంలోని నూటొక్క బొమ్మల్లోనూ ఇంత పట్టైన దెక్కడాలేదు.

మరో బాల్చీ, మరో బాల్చీ...

గుంపులో మనుషులు డబ్బులు పడేస్తున్నారు.

పావలా, పదిపైసలూ, ఐదుపైసలూ, అర్ధరూపాయీ...

గుంపును దూరంనుంచి చూసిన ఐస్క్రీం అబ్బాయి గబగబా అటు వచ్చాడు.

బిచ్చగత్తెచుట్టూ చేరిన చిల్లర చూసి కళ్లు మిటకరించాడు.

"అబ్బ! రోజంతా ఎండలో సచ్చి అయిస్క్రీం అమ్మితే సాయంకాలానికి ముప్పావలా ఇవ్వడానికి షావుకారు పావుగంట గునుస్తాడు."

మరోపావలా, మరో అర్ధరూపాయి...

మీద మీద లెక్క పెడితేనే ఆరున్నర...తను వారంరోజులు తిరగినా రానంత...

ముఖం చిట్లించే ముఖలింగం బిచ్చగత్తెవైపు చూస్తున్నాడు.

"రండి లోపలకి...కోటివిద్యలూ కూటికోసమే. వెధవవేషాలు పిక్కలా ఉంది చూడడానికి, దీనికేం జబ్బు!"

తలుపు ధడేలున వేసింది కోమలవల్లి.

ఎదురుంటి మీనాక్షమ్మ భర్తను జాగ్రత్త పెట్టుకుంది.

"మీకింకా చిన్నతనం పోలా! ఏమిటా చూపు" చిన్న సణుగు సణిగింది మరో ఆవి. తనకంటే ఎత్తరి, ఆజాను బాహువూ అయిన భర్తని చేతితోలాగే ధైర్యమూ లేక, శక్తీచాలక తనుమాత్రం లోపలికి వెళ్లిపోయింది.

"వెధవ ముండలకి తెలివితేటలకి లోపంలేదు" పూర్వసువాసినీ వెళ్లిపోయింది.

చోద్యం చూడడం పూర్తయింది.

గుంపు పలచబడిపోతూంది.

స్పృహలేని బిచ్చగత్తే, మెండి చెయ్యి, కుళాయిదిమ్మ, తంబ్రేలు డొక్కూ ఇవే మిగిలాయి.

వైద్యవిద్యార్థి అటు వచ్చాడు.

ఇది ఏ రోగలక్షణం? ఎకడమిక్ ఇంటరెస్ట్ ముంచుకొచ్చింది. మెడిసిన్ ప్రొఫెసర్ వల్లించుతుండగా మింగేసిన నాలుగు ముక్కలూ నెమరు వేసుకున్నాడు...పెటిట్ మాల్. గ్రాండ్ మాల్, ఎపిలెప్సీ, వాసోవేగల్ ఎటాక్. ఇడియో పథిక్ కాజెస్...ఓ సిగరెట్టు కాల్చుకోవాలనిపించి జేబులు తడుముకుని పెద్ద పెద్ద అంగలేస్తూ ముందుకు సాగాడు

బాల్చీతో నీళ్లు తీసుకొచ్చిన యువకుడు మాత్రం మిగిలాడు. అంతా వెళ్లిపోతుంటే తెల్లబోయి చూస్తూ.

ఎదురుగా కారు! ప్లస్ గుర్తు.

ప్లస్ అంటే చేర్చు! చేర్చడమే డాక్టర్లకి గుర్తు.

కారు ఆగిపోయింది. తోలేవాడు మనిషైతే చూస్తూ మనిషి మీదనుంచి ఎలా తోలేస్తాడూ?

"డాక్టరుగారూ! డాక్టరుగారూ! దయచేసి ఈమెనోసారి చూడండి," ఆవేశంగా అన్నాడు.

-ప్రొఫెషనల్ ఎథిక్స్-అనే వృత్తిపరమైన నడవడిక సూత్రాలు ప్రొఫెసర్ ఇచ్చిన లెక్చర్ ఎందుకో

గుర్తొచ్చింది డాక్టరు గారికి.

ఒకటీ అరా మనుషులింకా అక్కడ ఉన్నారు. ఆ వీధిలో తన పరువేం కావాలి? డాక్టరు మంచిమనిషి అనిపించుకోకపోతే తన దగ్గరకు అంతమంది ఎలావస్తారు?

తలుపు తెరిచి దిగారు డాక్టరుగారు.

రోడ్డుమీదే స్టెతస్కోపుతో ఆమె గుండెనొకసారి పరీక్షచేసి నాడి చూసి, కనురెప్పకిందచూసి నోరువిప్పబోయి ఆగిపోయారు.

"ఈమెకు ఆక్సిజన్ ఇవ్వాలి. తొందరగా ఆస్పత్రికి చేర్చండి. నిముషాలు చాలా ముఖ్యం. పెద్దాసుపత్రికి తీసుకుపోండి."

"డ్రైవర్ కారు బ్యాక్ చెయ్యి!"

కారులోకెళ్ళి కూచున్నారు.

తలుపు ధడేలున మూసుకుంది.

ముఖలింగంగారు మడిపంచ ఇప్పేసి లుంగీ చుట్టుకున్నారు. "అబ్బ! ఈ వెధవ పూతిక లోకటి." గొప్ప చికాకుగా లుంగీ దులుపుకుంటున్నారు.

వీధి నిద్రపోయింది.

ఆంధ్రపత్రిక 1976-77